ఆదిలోనే గుర్తిస్తే.. క్యాన్సర్ నివారణ

- ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే
- 18 ఏళ్లు నిండిన వారికి వైద్య పరీక్షలు
- ఇప్పటివరకూ 12 కేసులు గుర్తింపు

క్యాన్సర్ అనేది.. ప్రజలను కలవర పెట్టే భయంకరమైన వ్యాధి. ఈ వ్యాధి పేరు వింటే కాళ్లు, చేతులు వణికిపోతాయి. శరీరంలోని ఏ భాగానికైనా నోటి క్యాన్సర్, ఛాతీ, ఊపిరి తిత్తులు, గొంతు, స్వరపేటిక, రొమ్ము, జీర్ణాశయం, లివర్ క్యాన్సర్ ఇలా.. వంద రకాల క్యాన్సర్ వ్యాధులు రావచ్చు. స్త్రీ, పురుషులనే బేధం లేకుండా అనేక మందిని బలి తీసుకుంటోంది. ముందుగా సర్వే ద్వారా ఈ క్యాన్సర్ రోగులను గుర్తించి .. చికిత్స అందిస్తే నియంత్రించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

ప్రొద్దుటూరు క్రైం : ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించి తగిన చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చుననే ఉద్దేశంతో వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి సర్వే చేపట్టింది. గత నెల 16వ తేదీ నుంచి సర్వేలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ముమ్మరం చేసింది. 2025 ఆగస్టు వరకు 18ఏళ్లు నిండిన వారందరికీ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా నోటి క్యాన్సర్, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌పై పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన వారి వివరాలు సేకరించడమేగాక, గతంలో కుటుంబంలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. వ్యక్తుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారికి క్యాన్సర్ లక్షణాలున్నాయో లేదో ప్రాథమికంగా గుర్తిస్తున్నారు. సర్వేలో లక్షణాలు గుర్తిస్తే వారి వివరాలను పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యుల వద్దకు పంపిన తర్వాత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష నిర్వహిస్తున్నారు.

30 ఏళ్లు దాటిన స్త్రీలపై ప్రత్యేక దృష్టి

30 ఏళ్లు పైబడిన మహిళలపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వీరికి గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌పై స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. అందరితోపాటు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ కూడా చేస్తున్నారు. పురుషులకు పరీక్షలు చేస్తున్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 18 ఏళ్లు పైబడిన వారు 240029 మంది ఉండగా, ఇప్పటివరకు 18449 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. నలుగురికి నోటి క్యాన్సర్, ఐదుగురికి బ్రెస్టు క్యాన్సర్, ముగ్గురికి గర్భాశయ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. 111 మందికి అనుమానిత క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలాయి. తదుపరి వీరికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రొద్దుటూరు మున్సిపల్ పరిధిలో ఉన్న ఆరు యూపీహెచ్‌సీ కేంద్రాలతో పాటు రూరల్ పరిధిలోని కల్లూరు, కామనూరు పీహెచ్‌సీలు, రాజుపాళెం మండలంలోని పీహెచ్‌సీల పరిధిలో సర్వే ముమ్మరంగా చేస్తున్నారు.


శ్రీనివాసనగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ పద్మిని పర్యవేక్షణలో నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రాథమిక దశలో గుర్తిస్తే మెరుగైన వైద్యం



ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభమవుతుంది. ఇంటింటి సర్వే ద్వారా 18 ఏళ్లు దాటిన వాళ్లందరికీ పరీక్షలు నిర్వహిస్తూ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నాం. క్యాన్సర్ ఉన్నట్లు తెలియక చాలామంది వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రాథమిక దశలో ఈ వ్యాధి గుర్తించడమే సర్వే ముఖ్య ఉద్దేశం. ఇళ్ల వద్దకు వస్తున్న సిబ్బందికి సహకరించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ ఎస్.హిమబిందు, టీబీరోడ్డు వైద్యాధికారి, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

నేడు రాచాయపేటలో రెవెన్యూ సదస్సు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో బుధవారం రెవెన్యూ సదస్సు ఉంటుందని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సచివాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సదస్సుకు గ్రామ పంచాయతీ పరిధిలో రెవెన్యూపరమైన సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు పనులకు భూమిపూజ

పోరుమామిళ్ల : పట్టణంలోని మార్కెట్ వీధిలో రూ. 5 లక్షలతో సిమెంట్‌రోడ్ నిర్మించేందుకు మంగళవారం సర్పంచ్ సుధాకర్ భూమిపూజ చేశారు. పట్టణంలో 15 ఏళ్లుగా చాలా వీధులు సిమెంట్ రోడ్లకు నోచుకోకపోవడంతో రోడ్లన్నీ గుంతలు పడి, వానా కాలంలో ప్రజలకు ఇబ్బందికరంగా తయారయ్యాయి. దీంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మంగళవారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ షరీఫ్, వెంకటయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు భగవద్గీత పోటీలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గీతాజయంతిని పురస్కరించుకొని బుధవారం (నేడు) భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు సామూహిక గీతా పారాయణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పెద్దలు, మహిళలకు, సాయంత్రం 4 గంటలకు విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. వివరాలకు 96521 04655, 96523 83639 నెంబర్లను సంప్రదించాలన్నారు.

వంట ఏజెన్సీలకు జీతాలు చెల్లించాలి

కాశినాయన : వంట ఏజెన్సీలు, ఆయాలకు జీతాలు చెల్లించాలని ఎస్టీయూ సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. పాఠశాలలు తెరిచి 5 నెలలు కావస్తున్నా ఇంత వరకు వంట ఏజెన్సీలకు, ఆయాలకు జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఆయాలు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని, వారికి జీతాలు చెల్లించాలన్నారు. వంట ఏజెన్సీలకు జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి జీతాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కండక్టర్, డ్రైవర్లకు సత్కారం


డ్రైవర్లు, కండక్టర్లకు ధ్రువపత్రం అందిస్తున్న డిపో మేనేజర్ మల్లికార్జున


ప్రొద్దుటూరు : ఎక్కువ ఇంధనం పొదుపు చేయడంతోపాటు, డిపోకు ఆదాయం తెచ్చిన డ్రైవర్లు, కండక్టర్లను ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి మంగళవారం సత్కరించారు. డ్రైవర్లు ఎస్ఈజే హుస్సేన్, వీజేఎం.రెడ్డి, వీఆర్ఎస్.రెడ్డితోపాటు కండెక్టర్లు మహేష్ బాబు, టీవీఆర్‌రెడ్డిలకు ఆయన ధ్రువ పత్రాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి


మాట్లాడుతున్న వెంకట కృష్ణయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు సెక్రటరీ జనరల్ వెంకటకృష్ణయ్య యాదవ్ పేర్కొన్నారు. స్థానిక సగర సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టి చట్ట సభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ మహిళలకు ప్రత్యేక కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఐకమత్యంతో ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో నాగమల్ల శంకర్, మాదాసు మురళీ, దేవానంద్, ప్రతాప్, సుబ్బరాజు, సుబ్బరాయుడు, రామకృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కత్తి వెంకటరమణ

రాజుపాళెం : వాహన చోదకులు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. రాజుపాళెంలో ద్విచక్రవాహనాల్లో పరిమితికి మించి ఎక్కువగా వెళుతున్న వారికి, కారులో సీట్ బెల్టు పెట్టుకోని వారికి మంగళవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, అలా నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రానాయక్, పోలీసు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందం రద్దు చేయాలని ధర్నా


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదానీ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై విచారణకు పీఎం మోదీపై ఒత్తిడి తేకుండా మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై విరుచుకుపడటం ఏమిటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు ప్రశ్నించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో అదానీ విద్యుత్తు కొనుగోలు ఒప్పందం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ గ్రూప్ అక్రమాలకు ప్పాలడినట్లు అమెరికాలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్(న్యూయార్క్ కోర్టు), అమెరికా సెక్యూరిటీ ఎక్స్ఛేంజ్ కమిషన్ విడివిడిగా కేసులు నమోదు చేశాయన్నారు. ఏపీ ప్రభుత్వ అఫిషియల్స్‌కు లంచాలు ఇచ్చినట్లు ఎఫ్‌బీఐ అమెరికా కోర్టులో చార్జ్‌షీట్ వేసిందన్నారు. అక్రమ విద్యుత్ కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష కోట్ల భారం పడిందని నిపుణులతోపాటు సీఎం చెబుతున్నారన్నారు. ఇందులో నిజాలను ప్రజలకు వెల్లడించాలని, ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, వై.హరి, సోమల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రమీల,తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

రాజుపాళెం : గత కొన్నేళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందిపడుతున్న రైతులు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. మండలంలోని కూలూరు సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన సమస్యలను ఇక్కడే అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. ముద్దనూరు జీఎస్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య సదస్సును తనిఖీ చేశారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా సదస్సులను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీధర్, తహసీల్దారు వెంకటేశ్వర్లు, విజయభాస్కర్, హుస్సేన్‌రెడ్డి, మస్తాన్‌వలి, అశోక్‌కుమార్, వరద శేఖర్, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత రమణ

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.వి.రమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం జె.వి.భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీల పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, అంతటితో ఆగకుండా మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తుండేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడంతో నిరుపేద ఎస్సీ, ఎస్టీలపై తీవ్ర భారం మోపుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలలోపే ఒక్కో విద్యుత్ కనెక్షన్‌కు రూ.660 పైచిలుకు పెంచడం సరికాదన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్, పట్టణ నాయకులు చిన్న, రవీంద్ర, రాధాకృష్ణ, వీరభద్ర, సుధాకర్, నాగేంద్ర, ఓబులేసు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్య ప్రదాయిని


రైతులతో సమావేశమైన ఏడీఏ నాగరాజ

అట్లూరు : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండలం తిరువెంగళాపురం రైతుసేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తిరువెంగళాపురం గ్రామ పొలంలో సుమారు 200 ఎకరాలకు పైగా రబీ సీజన్‌కు సంబంధించి జొన్న సాగు చేశారని, ఈ జొన్నపైరులో కత్తెరపురుగు ఆశించి ముడ్డలో చేరి ఆకులను జల్లెడగా మార్చి విపరీతమైన నష్టం కలిగిస్తోందన్నారు. అనంతరం పురుగు నివారణకు మందులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ధాన్యానికి మంచి గిరాకీ ఉందని, కనుక ప్రతిఒక్కరు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించి ఆరోగ్యకరమైన ధాన్యాన్ని పండించుకుని జీవనశైలిని మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు సాయికిరణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగిరెడ్డి మమత, చంద్రకళ, పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ తీవ్రతను తగ్గించవచ్చు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు


మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

మైదుకూరు : క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే తీవ్రతను తగ్గించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మైదుకూరు మండలం జీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందిరా నగర్‌లో జరుగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వేకార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం అసంక్రమిత వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఎన్‌సీడీ 3.0 సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో అసంక్రమిత వ్యాధులైన రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను స్క్రీనింగ్ ద్వారా ముందుగానే గుర్తించవచ్చన్నారు. ఇలా గుర్తిస్తే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. అందరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్, సుధా, శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, ఎంపీహెచ్ఎస్ నవనీతమ్మ పాల్గొన్నారు.

మన హక్కులను కచ్చితంగా తెలుసుకోవాలి


మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

పోరుమామిళ్ల : ప్రజలందరూ మానవ హక్కులను తెలుసుకోవాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శ్యాంధన్ పేర్కొన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం సాయిరాం జూనియర్ కళాశాలలో జరిగిన మానవ హక్కుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛగా జీవించే హక్కు, మాట్లాడే హక్కు, అన్యాయాలను, అక్రమాలను, అవినీతిని ప్రశ్నించే హక్కు, సమానత్వ హక్కు ఇవన్నీ మానవ హక్కులేనని తెలియజేశారు. 1987లో మానవ హక్కుల సంఘం ఏర్పాటైందని, ఈరోజు 124 దేశాల్లో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ పని చేస్తోందన్నారు. హక్కుల గురించి మానవ హక్కుల రక్షణ చట్టంలో పేర్కొన్నారని, హక్కుల ఉల్లంఘన జరగకుండా చట్టాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సదస్సులో మదర్ థెరెసా ఫౌండేషన్ చైర్మన్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మానవ హక్కుల గురించిన అంశాల గురించి, ఉల్లంఘన జరిగిన సంఘటనల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా చీఫ్ గంగన్న, పబ్లిసిటీ ఆఫీసర్ ఫణిరావు, సెక్రటరీ ప్రసాదరావు, ఆర్గనైజర్స్ శ్రీనివాసులు, ఫరీదాబేగం, నెల్లూరు జిల్లా చీఫ్ దాసరి సునీల్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు వక్తలకు మెమెంటోలను అందజేశారు.

హక్కుల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది

బద్వేలు అర్బన్ : మానవ హక్కులు అనేవి మన స్వేచ్ఛ, స్వాతంత్య్రాలకు సంబంధించినవని, అటువంటి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిది అని పట్టణాభివృద్ధి కమిటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తిలు పేర్కొన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాలకులు మానవహక్కుల ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రజలందరూ స్వేచ్ఛా సమానత్వంతో జీవించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు ఓ.ఎస్.వి.ప్రసాద్, సమాచార హక్కు చట్టం పట్టణ కన్వీనర్ నాగార్జున, పట్టణాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు రాజేష్, బాలగురన్న, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని శివాలయం రోడ్డులో ప్రభుత్వ స్థలంలో కొద్దిరోజులుగా జరుగుతున్న వివాదంలో సంబంధిత నిర్మాణదారుడు ఆరోపించినట్లు సంబంధిత స్థలంలో ఎటువంటి పట్టా మంజూరు చేయలేదని, అది పూర్తిగా రెవెన్యూ రికార్డుల ప్రకారం రస్తా పోరంబోకుగా ఉందని తెలిపారు. అలాగే సంబంధిత స్థలంలో చేపడుతున్న నిర్మాణానికి గాను విద్యుత్ మీటరు ఏర్పాటు చేసుకునేందుకు గోపవరం రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ ఇచ్చినట్లు సదరు నిర్మాణదారుడు ఆరోపించాడని, అయితే తాము 857/2బి పట్టా స్థలానికి ఎన్‌ఓసీ ఇచ్చామని, వారు చేపడుతున్న నిర్మాణం 855 సర్వేనెంబరులోని ప్రభుత్వ స్థలంలో ఉందని తెలిపారు. నెల్లూరు రోడ్డు నుంచి శివాలయం వరకు ఉన్న రోడ్డు పక్కనే ఉన్న రస్తా పోరంబోకులో ఉన్న నిర్మాణాలను పరిశీలిస్తున్నామని, సంబంధిత రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎటువంటి ఆధారాలు లేకపోతే వారికి నోటీసులు అందజేస్తామని చెప్పారు. రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బి.మఠంలో మహా పడిపూజ

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో బుధవారం హరి హర పుత్ర అయ్యప్పస్వామి 8వ మహా పడిపూజ కార్యక్రమం చేపట్టనున్నట్లు అయ్యప్ప సేవా సమితి వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో మహిళలచే ద్వితీయ లక్షార్చన, భజనలు, అన్నదానాలు, రాత్రికి అల్పాహారం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి, ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి వీరకుమార స్వామి, తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి పాల్గొంటారన్నారు.

హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన


హెచ్‌ఐవీ గురించి విద్యార్థులకు వివరిస్తున్న నరేష్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ కుమార్ తెలిపారు. చైతన్య సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస ఫార్మా కాలేజీ విద్యార్థులకు ఎయిడ్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేష్ కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ఐసీటీసీ కౌన్సిలర్ నాగేంద్ర మాట్లాడుతూ ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ 1097కు ఫోన్ చేసి ఎందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పుల్లయ్య, భాగ్యలక్ష్మి, సునీత, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప గ్రామోత్సవం

కలసపాడు : స్థానిక ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు బుధవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి ఎద్దుల వెంకటరత్నం, ఆలయ ధర్మకర్త పి.సీతారామిరెడ్డిలు తెలిపారు. ఉదయం మహా గణపతిపూజ, అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమాలు, తీర్థప్రసాద వినియోగం ఉంటాయన్నారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. గ్రామోత్సవం సందర్భంగా చిన్నారులచే ప్రమిదల వెలుగులతో మదనపల్లె వారిచే కులుకు భజన, విజయనగరం వారిచే డప్పు వాయిద్యాలతో పాటలు, చెన్నై వారిచే కోలాటం, జోకర్‌లచే విన్యాసాలు, కడప వారిచే డ్రమ్స్, శ్రీఅభయ ఆంజనేయస్వామి బృందంచే కోలాట ప్రదర్శన ఉంటాయని చెప్పారు.

ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వీరశేఖర్

బద్వేలు అర్బన్ : ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలుగా పని చేస్తున్నవారికి కూలీ రేట్లు పెంచి ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాజెక్టు కాలనీ సమీపంలో చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి వలసలు, ఆత్మహత్యలను నివారించేందుకు 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. అలాగే కొలతల ప్రకారం కూలీ రేట్లు ఇవ్వడం వలన ఆశించిన స్థాయిలో కూలీ అందడం లేదని, ఇందుకోసం క్యూబిక్ మీటర్ రేటు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు సాగుభూమితోపాటు మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా, మండల నాయకులు బాలఓబులేసు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు : రైతుల నుంచి వచ్చే భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని నెర్రవాడ గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు సదస్సులలో ఫిర్యాదు చేస్తే పరిష్కారం చూపుతామన్నారు. నెర్రవాడ గ్రామంలో జరిగిన సదస్సులో 15 మంది రైతుల నుంచి ఫిర్యాదు అందాయన్నారు. వీటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నారాయణస్వామి, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది, స్థానిక గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక


మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమూర్తి

చాపాడు : గత వారంలో కురిసిన తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు వ్యవసాయశాఖ ఏడీఏ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె, చియ్యపాడు గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయాధికారి మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏడీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ క్రమంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల దినోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని అరవింద ఆశ్రమంలో లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ రాయలసీమ విభాగ జనరల్ సెక్రటరీ జగతి శ్రీనివాసులు, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ ఆర్.రెడ్డిప్రసన్న, జిల్లా మహిళా విభాగం లీగల్ అడ్వైజర్ సీవీ జయలక్ష్మి, సీనియర్ అడ్వకేట్ సీవీ సురేష్, చిప్పగిరి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.